

# పులిరాజుగారి కాలనీ

'వంశీ'

వోకో సిమ్మెంట్ పైపు చుట్టుకొలతా వంద అంగుళాలుంటుంది. పది అడుగుల పైనుండొచ్చు పొడుగు. ఆ సిమ్మెంట్ పైప్స్‌ని సిమ్మెంటు తూరలు అని కూడా అంటారు.

ఆ చిన్న టౌను చివర పి.డబ్ల్యు.డి. ఆఫీస్‌కి కాస్త దూరంలో వున్న మైదానంలో, వరసగా పక్కపక్కనే పేర్చి వున్నాయ్ పది తూరలు. పదేళ్ళ క్రితం పంపింగ్ స్కీమ్‌వాళ్ళు వో ప్రయోజనం కోసం వాటినక్కడ వేశారట. కానీ, యింతవరకూ వాటి మొహాన్నెవడూ చూళ్ళేదు.

బాగా పాతబడిపోయిన ఆ తూరల్లో పది కుటుంబాల జనం చాన్నాళ్ళనుంచి కాపురాలుంటున్నారు. వాళ్ళ కవే యిళ్ళు. అందుల్లోనే తింటారు, పడుకుంటారు, బిడ్డల్ని కంటారు. ఇంకా అందుల్లోనే అన్నీ.... అన్నీ.

అదే పులిరాజుగారి కాలనీ.

మాడిన కంచుగిన్నెలాంటి గుండు మీద పండిపోయి, తెల్లబడిపోయిన వెంట్రుకలు, ముడతలుపడి నలిగిపోయిన ముఖం, మూతిని తెల్లబడ్డ మీసాలు, మోకాళ్ళదాకా లాగి కట్టే కోరాపంచ, పొడుగ్గా బక్కచిక్కిన శరీరం.

అదీ పులిరాజు అవతారం. అతనే యీ కాలనీకి అధిపతి.

ఏ వూర్నుంచొచ్చాడో తెలీదు గాని, ఆ కాలనీకొచ్చి మట్టుకు రెండేళ్ళయింది.

అత నక్కడికి రాకముందు ఆ కాలనీలో జనం యింకో విధంగా బ్రతికారు. వొచ్చి పూర్తిగా మార్చిపారేశాడు వాళ్ళని.

జేబులు కొట్టే భద్రంకి రిక్షా లాగే పని అప్పగిస్తే, అడుక్కుని డబ్బులు తెచ్చేవాడి పెళ్ళాం నాగరత్నానికి మొలతాళ్ళు, సూది, పిన్నీసులూ అమ్మే పని పురమాయించాడు. చవగ్గా ఒళ్ళమ్ముకుని చవగ్గా బ్రతికేసే వెంకటలక్ష్మిని కర్రబొంగా, బుడగలూ అమ్మమండే, బూతుపాటలు పాడుకు బ్రతికే కృష్ణమూర్తికి హార్మోనీ నేర్పించి "మంచి పాటలు పాడి బ్రతకరా యెదవా?" అన్నాడు. అలా అలా అందరికీ అన్ని పన్లూ పురమాయించి, తనూ వో రిక్షా అద్దెకి తీసుకుని లాగుతూ ఆర్నెల్లకే దానికి వోనరయ్యాడు. ఆ కాలనీకి అధిపతయ్యాడు.

యెవడూ పట్టించుకోని ఆ జనాన్ని పులిరాజలా పట్టించుకుని బోర్డు మార్పులు తెచ్చినందుకు అతనంటే అక్కడందరికీ భక్తీ, భయమూను.

## 2

పులిరాజుగారి కాలనీలో యింకా సూర్యోదయం కాకుండానే నిద్రలేచిన పులిరాజు, బద్ధకంగా తూరలోంచి బయటికొస్తున్న అతని గుండుకి తూర అంచు చర్చిగంటలా ఠంగ్‌మనేసుకుంది. చాలా కోపమొచ్చేసింది పులిరాజుకి. గుండుకి కట్టిన బొప్పెని తడుముకుంటూ "వెధవ ద్వారం మరీ చిన్నది" అని విసుక్కుని తూరలోంచి సగం బయటికొచ్చి క్షణం అలాగే వుండిపోయి మరు క్షణం పూర్తిగా వొచ్చేశాడు. సమస్యకి పరిష్కారం లేదు గనుక.

వరసగా వున్న తక్కిన తూర్లో పడుకున్న జనం దొంగలు రాకుండా వుండటానికి గోనెపట్టాలూ, పాత సినిమా పోస్టర్లు అంటించిన తడికముక్కలూ అడ్డంగా పెట్టుకున్నారా తూరలకి.

వాటిని చూసిన పులిరాజుకి కోపం అటుగా మళ్ళింది. "వెధవలు, బారెడు పొద్దెక్కినా లేవకుండా తలుపులు బిగాయించుకు మరీ పడుకున్నారు," అని తిట్లతో ప్రభాత గీతాలు పాడి... పాడి, తన గొంతు ఎండిపోయినా అప్పటికీ లేవకపోయేసరికి తన నోటిని తనే సంబాళించుకుని, ఎదురుగా వున్న పెద్ద వేపచెట్టు కొమ్మందుకున్నాడు.

జారెడు పొడుగున్న వేపపుల్ల విరిచి, చివర కుచ్చులా నాలుగు ఆకులు మట్టుకు వుంచి, యీ చివర నోట్లో పెట్టుకుని నముల్తూ వాకో తూరదగ్గరికీ వెళ్ళి గోనెపట్టాలు యెత్తేసి నోట్లో వున్న పుల్లతో లోపల పడుకున్నవాళ్ళని కొట్టేసి మరీ తిట్లదండకం ఆరంభించాడు.

బద్దకంగా కొంచెం కదిలి మళ్ళీ పడుకుంటున్నారు జనం.

"వెధవలకి పులిరాజుగారొచ్చి లేపు తున్నా గౌరవం లేదు." అని సణుగుతూ నాలుగో తూర దగ్గరకెళ్ళి లోపలికి వొంగి పుల్లతో చురుక్కు-మనిపించి, నోరు విప్పి తిట్టబోతున్నవాడల్లా అలాగే ఆగిపోయాడు. విప్పిన నోరు మూస్తే ఒట్టు.

భద్రం, వాడి పెళ్ళాం నాగరత్నం బట్టల్లేకుండా కౌగలించుకు పడుకున్నారా లోపల. నాలుగేళ్ళ పసిపిల్ల వాళ్ళ కాళ్ళదగ్గర నిద్రోతోంది.

జన్మలో యెప్పుడూ రాని సిగ్గంతా ముంచుకొచ్చేసిన పులిరాజు పరుగున ఏదో తూర దగ్గరికి పరుగెత్తాడు.

అప్పుడే నిద్రలేచిన అరవైయ్యేళ్ళ అప్పయమ్మ, పదేళ్ళ మనవడు సత్తిగాడి మోకాలుమీద ఎద్దుకన్నంత కురుపు చీము పట్టిందని ఏడుస్తూ మోహనరాగం పాడ్తుంది; ఆరున్నర శృతిలో, ఆది తాళంలో.

నోట్లో పుల్ల బయటికి తీసిన పులిరాజు "అవునూ- యిది కురుపులా కనబడ్డం లేదే నా పాడు కళ్ళకి" అన్నాడు.

"కురుపే బాబూ- మూడు రోజుల క్రితం గెడ్డలా లేచింది. యివాళ్టికిలా కుళ్ళిపోయింది" అప్పయమ్మ జవాబు.

పులిరాజు దృష్టి సత్తిగాడి వైపు మళ్ళింది. కనుగుడ్లు తను చీకట్లో కాల్చే చుట్ట నిప్పంత ఎర్రగా జేసి, "ఏరా సత్తిగా! నిజం చెప్పరా" అని గదమా యించాడు.

కాస్సేపటికి భయపడి పోయిన సత్తిగాడు "పావలా పెట్టి గంటకి అద్దెకి తీసు కున్న సైకిలు మీంచి పడ్డానని నిజం చెప్పెయడంతో, చేతిలో పుల్లుచ్చుకుని దెబ్బవున్న ఆ మోకాలిమీద మూడు చరకలు అంటించాడు పులిరాజు.

చురుక్ చురుక్ మన్న సత్తిగాడు "కయ్ కయ్య్" మన్నాడు యింకా కుయ్యని మున్సిపల్ సైరన్‌లా.

వాంతో తూరల్లో పడుకున్న జనం బిలబిలా లేచొచ్చారు.

మరీ విడ్డూరంగా వొంగి వొంగి చూస్తున్న కృష్ణమూర్తిని "ఏంట్రా సీంబోతులా చూస్తావ్? వెళ్ళి మన భవనంలో అయిడిన్ వుంది తేట్రా" అని గదమాయించాడు.

"ఆ మందు దెబ్బతగిలిన వెంటనే తప్ప, యిప్పుడేస్తే మరింత కుళ్ళి పోద్దట పులితాతా!" కృష్ణమూర్తి జవాబు.

దాంతో క్రోధం మరింత ముంచుకొచ్చింది పులిరాజుకి. "నువ్వు వెంటనే వెళ్ళి తేవకపోతే యీ బరిసెతో నాలుగు బాది, ఆ మందు నీ కెయ్యాల్సొస్తది." అనడంతో తూరవైపు పరుగులంకించుకున్నాడు కృష్ణమూర్తి.

సత్తిగాడ్నలా కాస్సేపు యేడ్వనిచ్చి అనంతరం ముఖం కడిగి రిక్షాలో యెక్కించుకు తీస్కెళ్ళాడు హాస్పిటల్‌కి.

వెధవ హాస్పిటలు యెప్పుడు కదుల్తుందో యీ వెధవ క్యూ. తొమ్మిది గంటలలోపున యీ పని పూర్తిగాకుంటే పెర్మనెంటుగా కోర్టుకి తీసుకెళ్ళే ఆ కేసుల్లేని ముసలి లాయరుకి కోపమొచ్చి తనమీదే కేసెయ్యగలడు. అని తెగ భయపడ్డం మొదలెట్టాడు పులిరాజు.

అనుకున్నంతా అయింది. ఆ గవర్నమెంటు హాస్పిటల్ నుంచి కాలనీ కొచ్చే సరికి పదయింది. లాయరు తన్ని బోనెక్కించడం ఖాయం.

కట్టుగట్టించుకున్న సత్తిగాడ్ని కిందికి దింపి, మందులు చేతికిచ్చి పంపేలోదు యింకో విడ్డూరం చూశాడు.

వేప చెట్టు కింద నీరసంగా కూర్చున్న నాగరత్నం, నోట్లో వేపపుల్ల పెట్టుకుని మళ్లీ దోక్కుంటుంది.


కథ అర్థమయింది. రత్నాన్నెక్కించుకుని మళ్ళీ హాస్పిటల్ వైపుకి తిప్పాడు తన రథాన్ని.

మూడో నెలని డాక్టరు చేత అన్పించుకుని, బలం కోసం పళ్ళుతిని, టానిక్కులు తాగమని చెప్పించుకుని, ఎర్ర అరుకు సీసాతో బయటికొస్తుంటే వెనక నుంచి పెళ్ళాన్ని చూసి ఎవరో. అనుకున్న భద్రం పరుగునొచ్చి "ఏమ్మా! రిక్షాగావాలా?" అన్నాడు. అనంతరం షాకయ్యాడు.

భద్రం చొక్కా పట్టుకుని నాలుగు గుంజులు గుంజిన పులిరాజు "ఏరా! పొద్దోతే చాలు పావుగంటయినా యింటర్‌వెల్ యివ్వకుండా దాని పక్కలో పడుకోడం మొదలెట్టావ్ యిప్పుడు చూడ్రా ఏవయిందో? యీ పులిరాజుగారి కాలనీలో యిలాంటి అన్యాయాలు జరక్కూడదని యెన్ని సార్లు చెప్పాను. రాత్రుళ్ళు పాటలుగా కూడా పాడి బోధించానే ఏమయినా అర్థమయిందిరా మీకు?" అని గయ్యమంటూ లేచే సరికి జనం పోగడ్డారు. ఆ రిక్షావాడేమన్నా ఆమెని పాడుచేశాడా? అన్నట్టు చూస్తున్నారు చోద్యంగా.

అందరి మధ్యా సిగ్గుతో చచ్చిన చావయింది భద్రంకీ, నాగరత్నానికీ.

"దీన్ని కాలనీకి తీస్కెళ్ళు, అదే నీ కివాళ బేరం," అని ఆమెని వాడి రిక్షా యెక్కించి "ఇదిగో ఆఖరిగా చెప్తున్నాను. మళ్ళీ దాన్ని..." అని పెద్దగా అరుస్తుండగానే ఇవ్వాళ నాకీ నడిరోడ్డు మీద మానభంగం తప్పదురా దేవుడా!



అనుకుంటూ వేగంగా రిక్షాని లాగించేశాడు భద్రం.

## 3

ఆ టౌనికి మాలక్ష్మి అనే దున్నపోతు కొత్తగా వొచ్చాడు. వయసు పాతిక్కి మించదు, ఎత్తు ఆరడుగులు చిల్లర. చూడ్డానికి చెక్కని తుమ్మెదుంగలా వుంటాడు.

మెళ్ళో వో యిత్తడి బిళ్ళ కట్టుకుని, మూర్ఛరోగిని బాబో అని గజ గజా వణుకుతూ రోడ్డుపక్కన పడిపోయి డబ్బులు సంపాదిస్తున్న మాలక్ష్మిని పులిరాజు చూసి దభాల్ దభాల్మని నాలుగు బాది కాలనీకి తీసుకొచ్చాడు.

ఆ రాత్రంతా వాడ్ని వేపచెట్టుకింద కూర్చోబెట్టి నాలుగు నీతి కథలూ, ఆరు నీతి పద్యాలూ పాడాడు.

తెల్లవారింది.

రాత్రంతా మాలక్ష్మి కూర్చున్నది బోధివృక్షం కాకపోయినా జ్ఞానోదయం మట్టుకు అయింది.

టౌనుకి తీసుకెళ్ళి వాడికి రిక్షా యిప్పించాడు పులిరాజు.

నాలుగు రోజులకే పులిరాజుకి

మాలక్ష్మి అంటే చాలా యిష్టం యేర్పడింది, ప్రేమకూడా పుట్టింది.

యెందుకొచ్చిందో తెలీదు గాని మాలక్ష్మికీ, భద్రంకీ చాలా పెద్ద పేచీయే వొచ్చింది.

ఆరు నూరయినా, నూరు నూట మూడయినా ఆ రాత్రి కాలనీలో అందరి మధ్యా పెట్టి భద్రంగాణ్ణి పిచ్చిగా బాదా లనుకున్నాడు మాలక్ష్మి. కానీ, తను బాదితే తర్వాత పులిరాజు తనని డజను సార్లు బాదెయ్యగల్డు అని భయపడి పోయాడు.

మరెలా? బుర్రని డజనుల్లెక్కన గోక్కుని ఆలోచించాడు.

అప్పుడు గుర్తొచ్చింది.

స్టాండ్‌లో తనతోపాటు రిక్షాలాగుతుంటాడో బండ వెధవ. వాడి అసలు పేరు మట్టుకు బండవెధవ కాదు. నాగన్న. వాడాస్టాండ్‌కి వో బుల్లి విలను. సారా పోయించి యెవడ్ని తన్నిరమ్మన్నా తన్నిరావడమే గాకండా, అప్పుడప్పుడూ తన్నులు తినికూడా వొస్తాడు.

ఆ సాయంత్రం నాగన్నకి బాగా పోయించి, రాత్రయ్యాక కాలనీ దాకా తన రిక్షాలో లాక్కొచ్చి భద్రం మీదికి వుసిగొల్పాడు మాలక్ష్మి.

నాగన్న తూలుతూ మాలక్ష్మి కుడి భుజంమీద ఎడం చెయ్యేసి నవుస్తూ "ఎవడ్రా ఆడు? మా మాలచ్మిగాడితో తగాదా కొస్తాడా? యెన్ని డజను గుండెల్రా ఆడికి. ఆణ్ణియాల సంపి పేగుల్దీసి తాగుతాను. రక్తంగాదు.... సారా. రేయ్ బయటకి రా రా భద్రం నాయాలా."

ఆ చీకట్లో సైతాన్‌లాంటి నాగన్నని చూసిన భద్రం గుండెలు గుభేల్మన్నాయ్. ఆ గుభేల్మనడానికి ముందే కాళ్ళాడ్డం మానేశాయి. యేం చెయ్యాలో తోచడం లేదు. పరుగు పరుగున పులిరాజు దగ్గర కొచ్చేసి కాళ్ళు పట్టేసుకున్నాడు. నీవే రక్ష. నీవే మాకు తోడున్ నీడన్ అన్నాడు ఏడ్పుగొట్టు రాగంలో.

క్షణం ఆలోచించిన పులిరాజు అయిదు రూపాయిలు భద్రంకిచ్చి అర్జంటుగా రిక్షామీదెళ్ళి వో సారాసీసా పట్రమ్మన్నాడు.

వెళ్ళిన భద్రం అయిదు నిమిషాల కంటే ముందే వొచ్చాడు.

దాన్ని పట్టుకెళ్ళి నెమ్మదిగా నాగన్న నోట్లో గళ్ళాపెట్టి పొయ్యమన్నాడు పులిరాజు.

కాలనీ అదిరేట్టు తెగపేల్తున్న నాగన్నకి లజ్జుగా సారాసీసా అందించాడు భద్రం.

దాన్ని గటగటా తాగేసిన నాగన్న అప్యాయంగా తన ఎడంచెయ్యి భద్రం కుడిభుజంమీద, కుడిచెయ్యి మాలక్ష్మి ఎడం భుజంమీదా వేసి—

"ఒరేయ్.... యెవడ్రా ఆడు.... ఆణ్ణియాల రక్తం కళ్ళజూస్తేనే గాని సారా

ముట్టుకోను." అని పేలడం మొద లెట్టాడు.

నాగన్న చెరో చేతిలోవున్న ఆ శత్రువు లిద్దరూ "గొడవ మాటికేం గాని, ముందు వీణ్ణీ కాలనీ నుంచి బయటికి పంపితే అదే పదిపే"లను కున్నారు.

మొత్తానికి నాగన్నని వదిలించు కున్నాక, పులిరాజు మాలక్ష్మి జుట్టు పట్టు కుని గుంజుతూ భద్రంగా డ్నెందుకు కొట్టించబోయావో చెప్పమన్నాడు.

యెంతకీ చెప్పని మాలక్ష్మి చివరికో మాటన్నాడు. "నా పరిస్థితిలో నువ్వున్నా యిదే చేస్తావ్. నే నెందుకు చేశానన్నది నోటితో చెప్పను. నీకే తెలుస్తుంది" అని.

యెప్పుడూ అలా మాట్లాడని మాలక్ష్మి గాడలా మాట్లాడేసరికి యేదో పెద్ద పాయింటే వుందని నిర్ణయించుకుని పులి రాజు అర్జంటుగా తన బట్టతలమీద చేయి లేసేసుకున్నాడు ఆలోచించే నిమిత్తం.

## 4

భళుక్కు భళుక్కుమని వాంతి చేసు కుంటోంది సావిత్రి. ఆ రకమైన వాంతుల వడం అదే మొదటిసారి కావడంతో ఆమె కడుపంతా తిప్పేస్తోంది. రెండు చేతుల్లో తల పట్టుకుని వికారంగా మొహం పెట్టింది.

ఆ కాలనీలో అయిదో నెంబరు తూరలో వుంటున్న స్టేషన్లో అడుక్కునే పుట్టుగుడ్డి సూరన్న మనవరాలు సావిత్రి. ఆ తూరలో వుండేది వాళ్ళిద్దరే. తాతకి తను దారి చూపిస్తుంటే వాడడుక్కుం టాడు. "బాబయ్యా కళ్ళులేని కబోదిని దరమసెయ్యండ"ని. నిజానికి పగటి పూట వోకన్ను కన్పిస్తుందట సూరన్నకి.

అప్పుడే రిక్షా దిగొచ్చి ఆమె కక్కుళ్ళు చూసిన పులిరాజుకి పిసరంత మతిపోయింది.

మొన్న నాగరత్నం కక్కుతుం దంటే వో అర్థం, పరమార్థం వుంది. మరి దీనికేం పొయ్యేకాలంరా దేవుడా! అనుకుంటూ ఆమె దగ్గరికెళ్ళి విషయం అడిగాడు.

వికారంతోవున్న సావిత్రి "తర్వాత చెప్తాగానీ ముందు వికారం పోవడానికి వో చింతకాయ తెచ్చి పెట్టు తాతా!" అంది నీర్సంగా.

ఆమె జవాబుకి పులిరాజు పులిమీసాల వెనకున్న మూతిలోంచి మాటరాలేదు. కాస్సేపయ్యాకా "బుల్లి! యిది చింత కాయలు కాసే కాలం గాదే, అయినా మన భవనంలో డైనింగ్ టేబుల్ మీద చింత పండుంది తెస్తానుండని పరుగున తూర లోకి దూరుతుంటే గుండుకి ఠంగ్ మనేసు కుంది తూర అంచు. లోనికి సగం దూరినవాడల్లా చాలాసేపు అలాగే వుండి పోవడంతో చూస్తున్న సావిత్రి కర్థం గాలేదు.

రాత్రయింది.

అంతా వో చోట జేరారు.

అలా పంచాయితీ పెడితే తనెప్పుడూ

కూర్చునే సింహాసనం అనబడే తూరల పైభాగం యెక్కి కూర్చున్నాడు పులి రాజు.

-"ఈ పులిరాజుగారి కాలనీలో యిలాంటి అన్యాయాలూ, దౌర్జన్యాలూ జర క్కూడదు. ఇది మా శాసనం. చెప్పు.... నిజం చెప్పవే యెవడు నీకు కడుపు జేసిన వెధవ. చెప్పకుంటే యిక్కడున్న అందరి మగాళ్ళచేతా నీకు మెళ్ళో తాళి గట్టించేస్తాను. ఆ తరవాత చాలా యిబ్బంది పడిపోతావ్. ఆఁ."

పులిరాజు మాటలకి బెదిరిపోయిన సావిత్రి నిజం చెప్పేసింది నాకు కడుపు చేసింది భద్రం అని.

విన్న పులిరాజు ముఖంలో రెండు క్షణాల కాలం ప్రళికళ పోయింది. మరి కొన్ని క్షణాలయ్యాక తేరుకుని భద్రం గాడా చీకట్లో యెక్కడున్నాడో వెతుక్కుని అడిగాడు—

"ఏరా భద్రంగా యిదేం పోయే కాలంరా నీకు?"

పులిరాజు ప్రశ్నకి ఆ చీకట్లో తలొంచుకుని, సిగ్గుతో, మంద్రస్థాయిలో అన్నాడు భద్రం. "నువ్వేగా అన్నావ్ పొద్దోతే మా ఆవిడ్ని యింట్రవెల్ అయినా యివ్వకుండా యిబ్బంది పెట్టే స్తున్నానని.... అందుకని పక్కింటి యీ సావిత్రితో గడుపుతూ జాగ్రత్త పడ్తున్నాను."

వాడి జవాబుకి పులిరాజు పులికంఠం అరడజనోసారి మూగిబోయింది.

నిశ్శబ్దాన్ని భగ్నంచేస్తూ, మొహం నిండా బోల్డు సిగ్గుని పులిమేసుకుంటూ అంది సావిత్రి—

"భద్రంగాడి తప్పేంలేదు పులితాతా! నేనే యిష్టపడి పిల్చుకున్నాను."

అంతసేపూ పలుకే బంగారమాయె అన్నట్టున్న మాలక్ష్మి పొదచాటున పొంచివున్న ఆఫ్రికన్ టైగర్‌లా లేచాడు సావిత్రిమీద—

"పిల్చుకుంటావే పిల్చుకోవూ! వాడు ఎర్రతేలులాగుంటాడు, నేను బోదిరి కప్పలాగుంటాను. ఆ తేడాతో ఆడ్ని బోల్డులా చేసేసేవ్. పైగా సిగ్గులేకుండా చెప్తున్నావా? ఒరేయ్ నేను నిన్ను సుఖంకోసం రమ్మన్నేదే! పెళ్ళాడ్డాను. కోరింది తీరుస్తా రమ్మన్నాను. కాదు పొమ్మన్నావ్. యిప్పుడేడవ్వే. యీ బీదమారాజు నిన్ను ఎన్నేళ్ళేలుకుంటావో నేనూ చూస్తాను."

మాలక్ష్మి అలా పిచ్చిపిచ్చిగా అరుస్తుంటే అప్పుడర్థమయింది పులిరాజుకి, అసలా రోజు గొడవ యెందుకొచ్చిందో.

మాలక్ష్మి పులిరాజు దగ్గరికి నిజమైన పుల్లా దూసుకొచ్చి "పులితాతా! నువ్వు సంపు, నరుకు. నెలలోపు యీ లంజ కంటే, యీ రంకులాడికంటే అందమైన దాన్ని తీసుకొస్తాను. నువ్వే నాకు పెళ్ళి చెయ్యాలి. ఆఁ" అనెళ్ళిపోయాడా చీకట్లోకి.

జరిగిందానికి యేం చెయ్యలేని పులి రాజు అందరి సమ్మతంతోనూ రెండు రోజుల తర్వాత భద్రంకి రెండో పెళ్ళాంగా సావిత్రిని కట్టి పెళ్ళి చేసేశాడు.

"సరేగానీ వారే భద్రం! మరి యిద్దరు పెళ్ళాల్తో యీ భవనంలో వుండేదెలా?" అనడిగాడు పులిరాజు, తూరలకేసి యిబ్బందిగా చూస్తూ.

"ముగ్గురం యెలాగోలా సర్దుకుంటాంలే పులితాతా! సంటిది కాళ్ళదగ్గర పడుకుంటది."

"చంప్తాను వెధవా!"

"నువ్వు సంపితే వెదవలై నా యిద్దరు పెళ్ళాలూ ఏడుస్తారు."

"నోర్మయ్యరా సన్నాసీ— దీని దగ్గరో రాత్రి, దాని దగ్గరో రాత్రి పడుకో. యిది పులిరాజావారి ఆర్డరు."

"అలాగే."

"సావిత్రి దగ్గరకొచ్చిన రాత్రి గుడ్డి సూరన్నగారు మా భవనానికి విచ్చేస్తారు."

"అయిడియా చాలా టాపుగా వుంది.... అన్నట్టు యీరోజే సావిత్రితో శోభనం రోజు."

"సరే" అనేసి గుడ్డిసూరన్నగార్ని తమ భవంతికి తీసుకెళ్ళారు పులిరాజు గారు.

## 5

"పులితాతా! యీ రాత్రి నా కాబోయే పెళ్ళాన్ని తీసుకొస్తాను," అని సాయంత్రమే చెప్పేళ్ళిన మాలక్ష్మి సరిగ్గా రాత్రి ఎనిమిది గంటలకి రిక్షాని కాలనీ ముందాపి గంటని ఘల్లుఘల్లనిపించాడు.

తూరల్లోంచి జనం బిలబిలమంటూ వచ్చారు మాలచ్మిగాడి పెళ్ళామొచ్చిందంటూ.

అడా మగా ఆమెని చూశారు దీపాల వత్తులు పెద్దవి చేసి.

కుందనబ్బొమ్మన్నారు— లచ్చిందేవన్నారు.

ఆమెని చూసిన సావిత్రి గొంతు తడారిపోయింది. పట్టుదలగల మాలచ్మి సాదించిగెలిచాడనియేడ్చిందిమనసులోనే.

"ఉళ్ళంతా గాదు. ముందు మా పులి తాతకి చూపించాలి నిన్ను" అని సింహాసనం యెక్కి కూర్చున్న పులిరాజు దగ్గరికి తీసుకెళ్ళాడు.

"తాతా! యీ పిల్లని నేను యెత్తుకుని రాలేదు తాతా!! పాపం వాళ్ళోళ్ళు తనకంటే ముసలోణ్ణో, కుర్రాణ్ణో యిచ్చి పెళ్ళిచేస్తుంటే తప్పించుకుని పారిపోయొచ్చి నా రిక్షాలో యెక్కింది. వ్యభిచారం చేసుకునయినా బ్రతుకుతా గానీ తిరిగి మా వూరెళ్ళనంది. ఆ కొద్దు, నన్ను పెళ్ళాడతానని తీసుకొచ్చాను." అని నిజం నిజంగా చెప్పాడు మాలక్ష్మి.

వాడెప్పుడూ నిజమే చెబుతాడని నమ్మే పులిరాజు, అందుకే వాడంటే తనకిష్టమయిన పులిరాజు ఆ దీపం వెలుగులో ఆమెని చూశాడు.

"నీ పేరేంటమ్మా.... చెప్పమ్మా పర్లేదు."

"స్వరాజ్యం."

"చాలా మంచి పేరమ్మా.... మీదే వూరు?"

"ఫలానా వూరు" అని చెప్పలేదామె.

"ఈ పులిరాజుగారి కాలనీలో నీకెలాంటి భయం లేదమ్మా. చెప్పు మీదే వూరు?"

"మాది... మాది... తూర్పుగోదావరి జిల్లాలో రామచంద్రపురం పక్కన పసలపూడి."

అంతే___

ఆమె మాటలువిన్న పులిరాజుగొంతు మీద గొడ్డలిపెట్టి నొక్కినట్టయింది.

మూడుసముద్రాలు కలిసేచోటపొంగే కెరటాల్లా నరనరాల్లో రక్తం.

టక్ టకా టక్ టకా మునలిగుండె చప్పుడు.

సన్నగా తెగి స్రవిస్తున్న విషాదం.

## 6

ఆడాళ్ళంతా కాలనీముందు పేడ కళ్ళాపి జల్లి పెద్ద పెద్ద రథం ముగ్గు లేస్తే, మగాళ్ళు పందిరేసి, సిమ్మెంటు తూరల్నిండా రంగుకాయితాలతో జండాలు చేసి అంటించారు.

నాగరత్నం అమ్ముకునే రంగు మొల తాళ్ళకి పెద్ద పెద్ద రంగుకాయితం బుట్టలుకట్టి పేపట్టుకి వేలాడగట్టారు.

హార్మనీ వాయించి అడుక్కునే కృష్ణమూర్తి ఆ రాత్రంతా వాయిస్తూ పాడుతూంటే, వెంకటలక్ష్మి కర్ర బూరల్తోనూ, ఇళ్ళలోనుండి గిన్నెల తోనూ పక్కవాయిద్యాలు వాయించారు కుర్రాళ్ళు.

అద్దెకి తెచ్చిన పెట్రొమాక్స్ లైట్ని తెల్లవార్లూ వెలిగేలా చూశాడు భద్రం.

సావిత్రి పెళ్ళిపెద్దగా మారి అక్కడ కూడా "బాబయ్యా కళ్ళులేని కబోదిని దర్మం సెయ్యండని" అలవాటు ప్రకారం అడుక్కోబోతున్న గుడ్డిసూరన్నగార్ని నాలుగు బాదింది.


చావులకీ, తద్దినాలకీ వెళ్ళే బక్క బ్రాహ్మడొచ్చి తప్పుమంత్రాలు చదివి మొత్తంమీద ఘనం ఘనంగా పెళ్ళి చేసేశాడు.

## 7

అసలే బక్కచిక్కి వుండే పులిరాజు స్వరాజ్యం వచ్చినప్పటినుంచీ మరింత చిక్కిపోసాగాడు. పూర్వం హుషారూ, ఆ ఠీవీ పొత్తిగా లేవిప్పుడు.

కారణమేంటో తెలీదు. స్వరాజ్యం కళ్ళలోకి చూస్తే చాలు గజగజా వణికి పోతున్నాడు.

ప్రతి విషయంలోనూ పులిరాజుకంటే రెండాకులు ముందుంటుంది స్వరాజ్యం. మాటకి మాట సమాధానం యివ్వాలంటే ఆమె దగ్గర తర్ఫీదు పొందితీరాలి. కానీ, యెవరికీ ఆమె పద్ధతి నచ్చకపోన్నా




పులిరాజు మాట్లాడ్డంలేదని వాళ్ళూ అలాగే ఉండిపోతున్నారు.

ఓ రోజు పుదయం రిక్షాతో వెళ్ళిన పులిరాజు సాయంత్రం రిక్షాతో రాకండా దాని వెనకచక్రం టైరుని చంటికుర్రాళ్ళు దొర్లించుకుంటూ వస్తూంటే గ ఆయాస పడుతున్నా .

అంతా పులిరాజుని విడ్డూరంగా చూస్తున్నారు.

"మన రథం యేది పులితాతా?" ఎదురైన సత్తిగాడలా అడిగాడు.

పులిరాజు తన పులిమీసాల వెనక నుంచి పీలగా నవ్వేసి "అమ్మేశాన్రా, సత్తిగా! నువ్వామధ్య దొర్లించుకుంటాను యీ టైరు కావాలన్నావ్‌గా? అందుకే యీ టైరుని తీసుకుని మరీ అమ్మేశాన్రా రథాన్ని. ఇంద తీసుకో" అంటూ నవ్వుతుంటే అతని కంఠంలో యెక్కడో పిసరంత జీర ధ్వనించింది.

అక్కడెవరికీ యేదీ అర్థంగాక ఉండిపోయారు.

స్వరాజ్యం మట్టుకి యేదో అర్థమయిన దాన్లా తల పంకించింది.

## 8

తెల్లవారింది.

అందరికంటే ముందే లేచి తిడ్తూ లేపే పులిరాజు ఆ రోజు అసలు లేవనే లేదు.

ఆ వైపరీత్యానికి అంతా అతని తూరలోకి దూరి చూస్తే పులిరాజు కన్పించలేదు. సామానంతా అలాగే వుంది. లేనిది వచ్చేప్పుడు తనతో తెచ్చుకున్న చిన్న ట్రంకు పెట్టె మాత్రమే.

గొల్లుమన్నారంతా.

పులిరాజు పలాయనానికి కారకురాల స్వరాజ్యమే అన్నారు నిర్దుష్టంగా.

మాలక్ష్మి స్వరాజ్యాన్ని వేపచెట్టు కట్టి కొట్టాడు- ఆడాళ్ళంతా ఆమె జుట్టు

పీకి చీరా, జాకెట్టూ చింపారు- చిన్న పిల్లలు మట్టిబెడ్డల్తో కొట్టారు.

"చెప్పు మా పులితాతని యేంచేశావ్? చెప్పవే?? మమ్మల్ని మనుషుల్ని చేసి, తాగేది గంజయినా పాయసం అనుకో మని, వుండేది సిమ్మెంటు తూరల్లో అయినా వీటినే రాజభవనాలనుకుని తృప్తి పడమని, కష్టంలో సుఖం, సరదాలు చూసుకోమనే మా పులితాత ఏమయ్యాడో చెప్పు. లేదా చంపేస్తాం."

అలా తలొకరు తలో విధంగా అరుస్తూ గుంజారు స్వరాజ్యాన్ని.

"నాకు తెలీదు." స్వరాజ్యం జవాబు.

"తెల్సు. నువ్వొచ్చాకనే తనిలా మారిపోయాడు. అసలు మా పులితాతకీ నీకూ ఏమిటి సంబంధం? చెప్పవే???"

"ఏ సంబంధం లేదు.. మీ పులి తాతని నేను బాగా ఎరుగుదును. మీ పులితాతదీ మాదీ ఒకే వూరు."

"తర్వాత?"

"అతని అసలుపేరు పులితాత కాదు.. నల్లమిల్లి పెదభామిరెడ్డి."

"తర్వాత?"

"అతను మా వూరిలో అందరికంటే డబ్బున్నవాడు. రాజకీయాల్లో తిరిగాడు. న్యాయంగా పరిపాలించా లనుకున్నాడు. కానీ, అతని న్యాయానికి అన్యాయం జరిగింది. అతను మోసపోయి బికారి అయ్యాడు. డాక్టర్లు అతను మూడేళ్ళ కంటే ఎక్కువ బ్రతకలేడని చెప్పారు. కొడుకు వుంటున్న అమెరికా వెళ్తున్నా నని చెప్పి ఆ వూరు విడిచిపెట్టి వెళ్ళి పోయాడు. ఆ తర్వాత యిదే చూడ్డం అతన్ని."

"ఆ తర్వాత?"

## 9

డాక్టర్లు యిక మూడేళ్ళలో చని పోతావన్నమాట పదేపదే జ్ఞప్తికొస్తుం దేది. బాధపడ్లేదు, బెంగపడ్లేదు.

ధర్మంగా దేశాన్నేలే కోరిక యీ మూడేళ్ళలో యిక తీరదు.

అందుకే తన వునికి తెలియని యిన్ని వందలమైళ్ళ దూరం వచ్చి, యీ చిన్న ప్రపంచాన్ని తయారు చేశాడు. తన ఆశయాలకి అనుగుణంగా పాలించాడు.

చివరి మజిలీ యిదే అనుకున్నాడు పరమానదంగా.

కానీ, తన నెరిగిన మరో మనిషి వచ్చిందిక్కడికి. తన గురించి యిప్పుడో, రేపో యిక్కడి జనానికి చెప్పక మానదు. ఆమె చెబితే తన మనుషులకీ తనకీ మధ్య పెద్ద విచ్ఛేదం యేర్పడ్డం ఖాయం.

అందుకే యింకెవరూ యెప్పటికీ తనని గుర్తుపట్టని మరో ప్రపంచాన్ని సృష్టించుకునే నిమిత్తం....

కానీ,అతను సృష్టించుకోడానికి టైము చాలదు. యిక అతని ఆయుష్షు రెండు నెలలు మాత్రమేనట.